ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

గురువారం | 11 జూన్ , 2026 | పేజీలు : 06



వివరాలు మెయిన్‌లో

ముస్లిం మైనార్టీలకు రిజర్వేషన్‌తో పాటు నాణ్యమైన విద్య అందిస్తాం




నల్లగొండ




సూర్యాపేట



కళాకారుల ఆటా -పాటా



యాదాద్రి భువనగిరి



సిపిఐ జెండాతో చిన్నారి

కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్ డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలని సిపిఐ ఆధ్వర్యంలో బుధవారం ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా కలెక్టరేట్ల ఎదుట భారీ ధర్నాలు.

వివరాలు మెయిన్‌లో



## చెరువు పూడికతీత పనులు ప్రారంభం

**ప్రజాపక్షం/నడిగూడెం:** మండల కేంద్రంలోని చౌదరి చెరువులో ఉపాధి హామీ కూలీల ద్వారా చేపట్టిన చెరువు పూడిక తీత పనులను బుధవారం సర్పంచ్ దున్న శ్రీనివాస్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనులను ఉపాది కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉపాది కూలీలందరికి 120 రోజుల పనిదినాలు కల్పించే విధంగా పనులను గుర్తించాలని ఫీల్డ్ అసిస్టెంట్ పద్మకు సూచించారు. చెరువు మట్టి అవసరమైన రైతులు తమ వ్యవసాయ భూములకు తోలుకోవాలని సూచించారు. ఉపాధి కూలీలు పనిచేసే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని కూలీలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నాగరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ పద్మ, ఉపాధి మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

## బడిబాట కార్యక్రమం



**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** ప్రొఫెసర్ జయశంకర్ సార్ బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని రేవూరు గ్రామంలో జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు ప్రభుత్వం తరుపున అందిస్తున్న ప్రోత్సహకాలపై వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ బోధన వసతులు ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఫాతిమాబేగం, సర్పంచ్ జీవన్మైన గురుస్వామి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వెంకటరెడ్డి 25వ వర్ధంతి

**ప్రజాపక్షం/మునగాల:** కోదాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, బరాఖత్‌గూడెం మాజీ సర్పంచ్, టిడిపి రాష్ట్ర నాయకులు దివంగత జెట్టి వెంకటరెడ్డి 25వ వర్ధంతిని బుధవారం కుటుంబ సభ్యులు, టిడిపి నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని బరాఖత్‌గూడెం గ్రామ పంచాయతీ ఆవరణలో ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చల్లా గురవయ్య, ఉప సర్పంచ్ వేనేపల్లి శైలజ రమేష్‌బాబు, కుటుంబసభ్యులు జెట్టి రాంరెడ్డి, జెట్టి కోటిరెడ్డి, జెట్టి నర్సిరెడ్డి, ప్రమీల, సునీత, స్వరూప, రామనర్సిరెడ్డి, సునిత పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారమే గ్రామసభల లక్ష్యం

**ప్రజాపక్షం/నడిగూడెం:** సమస్యల పరిష్కారమే గ్రామ సభల లక్ష్యమని మండల స్పెషల్ ఆఫీసర్, వ్యవసాయ అధికారి మల్సూర్ అన్నారు. బుధవారం మండలంలోని వల్లాపురం గ్రామంలో ఏర్పాటుచేసిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసమే ప్రభుత్వం 99 రోజుల ప్రజాపాలన, ప్రగతి ప్రణాళికను అమలు చేస్తుందని, ప్రజల భాగస్వామ్యంతోనే ఇది సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిపిఒ శోభన్‌బాబు, ఎంఈవో వనం సత్యనారాయణ, ఎఈవో రేణుక, కార్యదర్శి రణబోతు మల్లారెడ్డి, ఉప సర్పంచ్ కోట శేఖర్‌రెడ్డి, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## జెసి గ్రౌండ్ ఉమ్మడి జిల్లాకే ఆదర్శం..

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనే మరెక్కడా లేని విధంగా జేసీ గ్రౌండ్‌ను సకల వసతులతో తీర్చిదిద్ది, ప్రజల ఆరోగ్య పరిరక్షణ కేంద్రంగా మార్చిన వాకర్స్ అసోసియేషన్ కమిటీ సభ్యుల కృషి ఎంతో అభినందనీయమని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కొనియాడారు. జేసీ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం డాక్టర్ రాపోలు కరుణాకర్ చే నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉచిత సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డిని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే రోజుల్లో జేసీ మైదానంలో క్రీడల అభివృద్ధికి, మరిన్ని ఉచిత హెల్త్ క్యాంపుల నిర్వహణకు తన వంతు పూర్తి స్థాయి నిధులు, సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు. పట్టణ ప్రజలు ఈ గ్రౌండ్‌ను సద్వి



నియోగం చేసుకోవాలని కోరారు. ఈ మెడికల్ క్యాంపులో 110 మందికి ఉచితంగా గుండె పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిలుకూరు సుధా బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ నర్ర శ్రీజా రెడ్డి, అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు గూడపూరి లక్ష్మణ్, కన్నెబోయిన వెంకటేశ్వర్లు యాదవ్, డాక్టర్ రాజు, ఎంఈఓ ధర్మానాయక్, కౌన్సిలర్ అశోక్ నాయక్, మున్నేరు పాల్గొన్నారు.

## ఫీజుల భారాన్ని తగ్గించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రైవేటు విద్యాసంస్థల్లో ఇష్టానుసారంగా పెరుగుతున్న ఫీజుల భారాన్ని నిరసిస్తూ, ఆ దోపిడీపై ఉమ్మడి ఉద్యమానికి బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు శ్రీకారం చుట్టారు. మిర్యాలగూడ పట్టణంలో ప్రైవేటు యాజమాన్యాల అక్రమాలను సహించేది లేదని తేల్చిచెప్పారు. బుధవారం పట్టణంలో నిరసన వ్యక్తం చేసి బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ ఈ సందర్భంగా ప్రసంగిస్తూ మిర్యాలగూడలో విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లోపించిందని, అందువల్లే ప్రైవేటు స్కూళ్లు ఫీజుల దోపిడీకి తెగబడ్డాయని విమర్శించారు. అడ్మిషన్ల రుసుములు, వార్షిక ఫీజులతో పాటు బస్సులు, యూనిఫామ్స్, షూస్, బెల్టుల విక్రయాలను కూడా పాఠశాలల్లోనే వ్యాపారంగా మార్చేశారని మండిపడ్డారు. సామాన్య, మధ్య తరగతి తల్లిదండ్రులు అప్పులపాలవుతున్నా పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు విద్యార్థి రాష్ట్ర ఉపాధ్యక్షులు తాళ్లపల్లి సురేష్, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయక్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్క నాగేశ్వరరావు, బీసీ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి గంగాధర్, బీసీ యువజన సంఘం జిల్లా కన్వీనర్ సిద్ధం రాజు, బీసీ యువజన సంఘం పట్టణ నాయకులు మునగాల శైలేందర్, సుధాకర్ పాల్గొన్నారు.

## కక్షిదారుల సౌకర్యార్థం వసతుల కల్పన అవసరం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కోర్టు కేసుల విచారణ నిమిత్తం వచ్చే కక్షిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కోర్టు ఆవరణలోనే అన్ని వసతులు కల్పించడం ఎంతో అవసరమని ఐదవ అదనపు జిల్లా జడ్జి కేవీ చంద్రశేఖర్‌రావు అన్నారు. మిర్యాలగూడ కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నూతన ఫోటో స్టాట్ సేవా కేంద్రాన్ని ఐదవ అదనపు జిల్లా జడ్జి కేవీ చంద్రశేఖర్ రావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ కక్షిదారులు తమకు తక్షణమే అవసరమైన పత్రాలను వెంటనే ఇక్కడే జిరాక్స్ తీసుకుని కోర్టులో సమర్పించే అవకాశం ఉంటుందని వివరించారు. ఈ సదుపాయం వల్ల న్యాయవాదుల విలువైన సమయం



కూడా ఆదా అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు గౌరు వెంకటేశ్వర్లు, న్యాయవాదులు నేతి సత్యనారాయణ, లింగంపల్లి శ్రీనివాస్, గిన్నె శ్రీనివాస్ రెడ్డి, జంగిలి ఎల్లయ్య, కుమార్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

## వర్షకాలంలో ప్రజలందరూ తగు జాగ్రత్తలు పాటించాలి

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** రానున్న వర్షకాలంలో ప్రజలందరూ జాగ్రత్తలు పాటించాలని మున్సిపల్ చైర్మన్ కొణతం చిన్న వెంకటరెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా వార్డు సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో బుధవారం నేరేడుచర్ల మున్సిపల్ కార్యాలయ ఆవరణలో 2,3,6, 10,11 వార్డులలో ప్రజలతో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షకాలంలో ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని అనారోగ్య బారీన పడకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. పట్టణ పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అనంతరం ఇంకుడు గుంతల నిర్మాణాలు, స్వేచ్ఛ సర్వేక్షణ, తడి పోడి చెత్త వేరు చేసే విధానం, వన మహోత్సవం, తాగునీరు, డ్రగ్స్ తదితర అంశాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగరాజు, స్పెషల్ ఆఫీసర్ నర్సింహా,



మున్సిపల్ వైస్ చైర్మన్ సందీప్‌రెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మార్కెట్ వైస్ చైర్మన్ సురేష్‌రెడ్డి, సిఐ చరమందరాజు, ఎస్ఐ సైదిరెడ్డి, వైద్యాధికారిని నాగిని, ప్రధానోపాధ్యాయులు మధు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



## ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

**ప్రజాపక్షం/తుంగతుర్తి :** గీతవృత్తిపైనే ఆధారపడి జీవిస్తూ ప్రమాదవశాత్తు గాయాలపాలైన చీకటి శ్రీనివాస్‌కు ప్రభుత్వం రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కల్లు గీత కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా సహాయ కార్యదర్శి బత్తుల జనార్ధన్ ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని గొట్టిపర్తి గ్రామానికి చెందిన గీత కార్మికుడు చీకటి శ్రీనివాస్ తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి పడడంతో అతనికి మూడు ఎముకలు విరగడంతోపాటు తలకు గాయమై పది కుట్లు పడ్డాయి. కుటుంబ సభ్యులు అతడిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ సందర్భంగా గీత కార్మికుడిని పరామర్శించి ఆయన మాట్లాడారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మద్దెల నరసయ్య, చిర్ర నరేష్, బొమ్మగాని వెంకన్న, చీకటి మల్లయ్య, చామకూరి శ్రీను పాల్గొన్నారు.

## పల్లివాడ జిపిలో రూ.70 లక్షల అప్పులపై అధికారుల సమాధానం ఏమిటి?

### సర్పంచ్ శ్రీనివాసులు గౌడ్

**ప్రజాపక్షం /రామన్నపేట :** మండలంలోని పల్లివాడ గ్రామపంచాయతీలో గత పాలకులు చేసిన రూ.70 లక్షల అప్పులపై అధికారులు సమాధానం చెప్పాలని గ్రామ సర్పంచ్ కంభంపాటి శ్రీనివాసులు గౌడ్ డిమాండ్ చేశారు.గ్రామంలో నిర్వహించిన 99 రోజుల ప్రగతి ప్రణాళిక గ్రామసభలో ఆయన మాట్లాడుతూ,ప్రస్తుత ప్రభుత్వంపై మరియు అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గత ఆరు నెలల నుండి గ్రామానికి ఒక్క రూపాయి నిధులు కూడా ఇవ్వలేదని సర్పంచ్ ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మంజూరు చేసిన సీసీ రోడ్ల నిధులు, జంగాల కాలనీ ఎస్సీ కమ్యూనిటీ హాల్ పనులు, మిషన్ భగీరథకు సంబంధించిన రూ.18 లక్షల బిల్లులను రాజకీయ కక్షతో అధికార పార్టీ నాయకులు నిలిపివేశారని మండిపడ్డారు.

**పాత అప్పుల వేధింపులు :** గత పాలకులు నిధులు మంజూరు కాకుండానే రూ. 26 లక్షల పనులు చేసి అప్పులు మిగిల్చారని,ఆ పాత బిల్లులు చెల్లించాలంటూ ఎంపీడీవో కార్యాలయం,అధికార పార్టీ నాయకులు,కార్యదర్శి ద్వారా తనపై ఒత్తిడి తెస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 20/19/2022 మధ్య పల్లివాడకు రూ. 92 లక్షల నిధులు వచ్చినా,అదనంగా రూ. 70 లక్షల వరకు అప్పులు ఎందుకు చూపించాల్సి వస్తోందో అధికారులు తేల్చాలన్నారు.

**విద్యుత్ బిల్లుల భారం తగ్గింపు :** గతంలో మోటార్లు ఇష్టానుసారంగా వేయడం వల్ల పంచాయతీకి రూ. 53 లక్షల కరెంట్ బిల్లు పేరుకుపోయిందని, తాను బాధ్యతలు తీసుకున్నాక వృధా నల్లా కనెక్షన్లకు డమ్మీలు వేయించి, నెలకు రూ.1.50 లక్షలు వచ్చే బిల్లును రూ.70 వేలకు తగ్గించానని సర్పంచ్ వివరించారు.

**మహిళా సంఘ భవనాల్లో వివక్ష :** కేంద్ర ప్రభుత్వం మండలంలోని 16 జీపీలకు మహిళా సంఘ భవనాలు కేటాయిస్తే కేవలం కాంగ్రెస్ గెలిచిన గ్రామాల్లోనే ఇస్తూ,పల్లివాడ లాంటి మేజర్ పంచాయతీతో పాటు ప్రతిపక్షాలు (బీఆర్ఎస్, సీపీఎం) గెలిచిన 9 గ్రామాలకు నిధులు కేటాయించకుండా వివక్ష చూపిస్తున్నారని ఆరోపించారు.

**అధికారుల ఏకపక్ష వైఖరి :** ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో సర్పంచ్‌కు సమాచారం ఇవ్వకపోవడం,వడ్ల కాంటాల దగ్గర అధికార పార్టీ నేతలకు అనుకూలంగా వ్యవహరించడంపై అగ్రికల్చర్ అధికారుల తీరును తప్పుపట్టారు. అధికారులు పార్టీలకు వత్తాసు పలకకుండా, నిష్పక్షపాతంగా విధు లు నిర్వహించాలని హితవు పలికారు. జూన్ 2న నూతన పెన్ష న్లు ఇస్తామని నమ్మించి ప్రభుత్వం వికలాంగులు, వృద్ధులు, వితంతువుల ఆశలపై నీళ్లు చల్లిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.





## తండ్రికి తలకొరివి పెట్టిన తనయ

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండలం లింగ వారి గూడెం కు చెందిన చిట్యాల సత్తిరెడ్డి (77) మరణించడంతో అతని కుమార్తె సరళ తండ్రి కి తలకొరివి పెట్టారు. సత్తిరెడ్డి గుండెపోటుతో మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. అతనికి కుమారులు లేకపోవడంతో అంత్యక్రియలను ఏకైక కుమార్తె పల్లె సరళ శాస్త్రోక్తంగా బుధవారం నిర్వహించారు. సత్తిరెడ్డి మృతికి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. ఆయన పార్థివ దేహం పై ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మాజీ ఎమ్మెల్యేలు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, ఉజ్జిని యాదగిరి రావు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## మాదక ద్రవ్యాలను నిర్మూలించడం మనందరి బాధ్యత



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** మాదక ద్రవ్యాలను పూర్తిగా నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ మగ్దూం అలీ అన్నారు. బుధవారం పోలీస్ ఈగల్ టీం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నార్కోటిక్ డిఎడిక్షన్ సెంటర్ ఆవరణలో వైద్యబృందంతో కలిసి వారు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజాన్ని పట్టిపీడిస్తున్న మాదకద్రవ్యాల మహమ్మారిని అంతమొందించడమే లక్ష్యంగా తెలంగాణ పోలీస్ ఈగల్ టీం పనిచేస్తుందన్నారు. డ్రగ్స్ రహిత సమాజ స్థాపన కోసం జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆవరణలో మొక్కలు నాటడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ వైద్యులు, రెవెన్యూ, పంచాయితీరాజ్, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సామిల్, టింబర్ డిపో నూతన కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ది సూర్యాపేట జిల్లా సామిల్, టింబర్ డిపో అసోసియేషన్ నూతన కమిటిని రాష్ట్ర నాయకులు గొల్లపల్లి అనిల్, గుడిపాటి కిరణ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా తౌడోజ్ సలేంద్రచారి, ప్రధాన కార్యదర్శిగా నరసింహాచారి, కోశాధికారిగా బైరోజు ఉపేంద్రచారి ఎన్నికయ్యారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటి సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసోసియేషన్ అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పర్వతం నాగాచారి, ఉపేంద్రచారి, కల్లూరి మురళీకృష్ణ, లింగయ్య, కల్లూరి వేణు, బాలకృష్ణ, శంకర్, శివ, కృష్ణ, ఉపేంద్రచారి పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏఐ శిక్షణ

**జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**




ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : కార్పోరేట్ పాఠశాలల విద్యార్థులతో సమానంగా ప్రభుత్వ పాఠశాల పిల్లలకు కూడా అత్యాధునిక సాంకేతిక అవకాశాలు దక్కాలన్న ఉద్ధేశ్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ శిక్షణ అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. టీఫైబర్, సూపర్ టీచర్ ఎద్యురిఫార్మ్స్ సంస్థల సహకారంతో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న నెల రోజుల ఏఐ శిక్షణ కార్యక్రమం పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను భవిష్యత్తు సాంకేతికత వైపు నడిపించేందుకు సూర్యాపేట జిల్లా అధికారులు డిజిటల్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్య ద్వారా విద్యార్థులను గ్లోబల్ లీడర్లుగా తీర్చిదిద్దేందుకు సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈనెల 15 నుండి జూలై 11 వరకు నెల రోజుల పాటు శిక్షణ కొనసాగనుందన్నారు. మొదటి విడతగా జిల్లాలోని నాలుగు పాఠశాలల్లో దీనిని నిర్వహించనున్నట్లు చెప్పారు. డిజిటల్ యుగంలో రాణించడానికి ఏఐ అక్షరాస్యత ఎంతో కీలకమని, ఇది విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచి భారతదేశ డిజిటల్ పరివర్తన ప్రయాణంలో వారిని భాగస్వాములను చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిఇఓ అశోక్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ గఫ్ఫార్, టీఫైబర్, సూపర్ టీచర్ ఎద్యురిఫార్మ్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎఐఎస్‌టిఎఫ్ జాతీయ కౌన్సిల్ మెంబర్‌గా కొనకంచి వీర రాఘవులు నియామకం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ఆల్ ఇండియా సెకండరీ టీచర్స్ ఫడరేషన్ (ఎఐఎస్‌టిఎఫ్)జాతీయ కౌన్సిల్ మెంబర్‌గా కొనకంచి వీర రాఘవులు నియమితులయ్యారు.రాజమహేంద్రవరంలో జరిగిన ఎఐఎస్‌టిఎఫ్ జాతీయ సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి జి.సదానందం గౌడ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కత్తి నరసింహారెడ్డి చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు.ఈసందర్భంగా కొనకంచి వీర రాఘవులు మాట్లాడుతూ,కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్‌ఈపీ2020 విద్యా విధానాన్ని ఉపసంహరించుకోవాలని,దేశవ్యాప్తంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.వీర రాఘవులు నియామకంపై ఎస్‌టియుటిఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ తండు భాను ప్రకాష్ గౌడ్,జిల్లా ప్రధాన కార్యదర్శి మురారిశెట్టి రమేష్,రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందిమల్ల నరేందర్ రెడ్డి,జిల్లా ఆర్థిక కార్యదర్శి కొనకంచి వెంకటేశ్వర్లు,మిర్యాలగూడ మండల అధ్యక్షుడు అంబటి వీరనారాయణ,ప్రధాన కార్యదర్శి వలిశెట్టి విజయభాస్కర్,జిల్లా నాయకులు తావూరియా,లాలు,రామ్ సింగ్, దత్తేశ్వర్,సురేష్ కుమార్,నవీన్ తదితరులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# ఆర్మీ, వాయుసేనలకు ఇద్దరు క్యాడెట్లు ఎంపిక





**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కె.ఎన్.ఎం. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్.సి.సి. విభాగంలో అందిస్తున్న క్రమశిక్షణతో కూడిన శిక్షణకు అరుదైన గౌరవం దక్కిందని, అగ్నిపథ్ పోటీల్లో తమ క్యాడెట్లు సత్తా చాటారని ఎన్.సి.సి సిటిఓ డాక్టర్ గుమ్మడి నరేష్ హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం దేశ రక్షణ రంగంలో ప్రవేశపెట్టిన అగ్నిపథ్ పథకం ద్వారా ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగాలకు ఎంపికైన కళాశాల విద్యార్థులు అవిరెండ్ల సాయి కుమార్, డి. భవానీ శంకర్‌లను అధ్యాపక బృందం ఘనంగా అభినందించింది. ఈ సందర్భంగా డాక్టర్ గుమ్మడి నరేష్ మాట్లాడుతూ కళాశాలలోని ఎన్.సి.సి. క్యాడెట్లు మొదటి నుండి శారీరక దారుఢ్య పరీక్షల్లో, క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. బిఏ చదువుతున్న సాయికుమార్ ఆర్మీ ట్రేడ్స్‌మెన్ విభాగానికి ఎంపికై నాసిక్ కేంద్రంలో ప్రతిష్టాత్మక శిక్షణ తీసుకోనుండగా, బిఎస్సీ చివరి సంవత్సరం చదువుతున్న భవానీ శంకర్ వాయుసేనకు ఎంపికై బెల్గాం క్యాంపులో శిక్షణకు సిద్ధమయ్యాడని తెలిపారు. గ్రామీణ నేపథ్యం ఉన్న విద్యార్థులు పట్టుదలతో శ్రమించి భారత రక్షణ దళాలలో ఉద్యోగాలు సాధించడం మిగతా విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం. భీమార్జునరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది, ఎన్.సి.సి. సీనియర్ క్యాడెట్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణకు ప్రజలు సహకరించాలి




**ప్రజాపక్షం/మోటకొండూర్ :** ప్రమాదాల నివారణకు ప్రజలు ప్రతి ఒక్కరు సహకరించాలని యాదగిరిగుట్ట రూరల్ సీఐ మాదాసు శంకర్ గౌడ్ అన్నారు. ఆయన బుదవారం మోటకొండూర్ మండలంలోని చాడ, తేర్యాలలలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలు భాగంగా సర్పంచుల ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన గ్రామ సభలలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరైవ్ అలైవ్ అనే కార్యక్రమంలో బాగంగా ద్విచక్ర వాహనాలు నడిపే వాళ్ళు తప్పనిసరిగా ఎల్మేంట్ వాడాలని, కార్లలో ప్రయాణించే వాళ్ళు సీటు బెల్టులు తప్పనిసరిగా వాడాలని సూచించారు. ఎంపిడిఓ ఇందిర మాట్లాడుతూ గ్రామాలలో మంచినీటి సరఫరా, విద్యుత్ సమస్యలు తడి చెత్త పొడి చెత్త లాంటి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఇందిర, ఎంపి ఓ చంద్ర శేఖర్, ఎస్ఐ డి.అశోక్, ఏఈ ఎలక్ట్రిసిటీ, అగ్రికల్చర్ ఆఫీసర్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ, మెడికల్ ఆఫీసర్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ బిఎల్ఏలకు ప్రత్యేక శిక్షణ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు మిర్యాలగూడ నియోజకవర్గంలో బూత్ లెవెల్ ఏజెంట్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌లతో కలిసి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడంలో ఏజెంట్ల పాత్ర కీలకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతి అర్హుడికి ఓటు హక్కు అందేలా కృషి చేయడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ, ఓటరు నమోదుపై కార్యకర్తలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పున్నా కైలాష్ నేత, మాజీ డీసీసీ అధ్యక్షుడు మాసనపల్లి లింగాజీ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా కరుణాకర్ రెడ్డి

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** మండలంలోని తిరుమలాపూర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షునిగా చాడ కరుణాకర్ రెడ్డి బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుని ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలోని కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీని బలోపేతం చేయడానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఐనాల చైతన్య మహేందర్‌రెడ్డి, మండల నాయకులు శంకర్ నాయక్, భాస్కర్ రెడ్డి, మమత, పట్టు నాయక్, గ్రామ సర్పంచ్ దొనికెన రేణుక వెంకటేష్ యాదవ్, వంగ నారాయణరెడ్డి, రాజి రెడ్డి, సముద్రాల వెంకటేష్ పాల్గొన్నారు.

## నాగార్జున వివాహ రిసెప్షన్‌కు హాజరైన ప్రముఖులు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పట్టణంలోని ఎంఎన్‌ఆర్ గార్డెన్స్‌లో సమాచార హక్కు పరిరక్షణ సమితి,ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు సోదరుడు,బిఆర్ఎస్‌వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జునహరిణిల వివాహ రిసెప్షన్ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈకార్యక్రమానికి హాజరైన మాజీ మంత్రి,ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం,కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గాదరి కిశోర్ కుమార్,కంచర్ల భూపాల్ రెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించారు.కార్యక్రమంలో మాజీ కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవి,రాష్ట్ర నాయకులు చెరుకు సుధాకర్,కంచర్ల కృష్ణారెడ్డి,చాడ కిషన్ రెడ్డి,నేవూరి ధర్మేందర్ రెడ్డి,రాష్ట్ర మహిళా నాయకురాలు పాల్వాయి స్రవంతి,జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ రేగట్టే మల్లికార్జున రెడి పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి కృషి చేస్తా



**ప్రజాపక్షం/వేములపల్లి:** గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని సర్పంచులు పుట్టల సందీప్ కుమార్,బుర్రి లక్ష్మి,దేశిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం జరిగిన గ్రామసభల్లో ఆయన మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధం,తాగునీరు,డ్రైనేజీ మరమ్మతులతో పాటు ప్రజా సమస్యలను సమగ్రంగా పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈకార్యక్రమంలో ఎంపీడీఓ జితేందర్ రెడ్డి,ఎంపీఓ లలిత,ఏఈ నాగరాజు, ఏఓ కిషన్ నాయక్, ఎస్సై వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ మల్లయ్య యాదవ్,సురేష్,కార్యదర్శులు శ్రీకాంత్,కిరణ్ కుమార్,సామ్రాజ్యం,ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజని, ఏఈఓ షఫీ,వార్డు సభ్యులు పాల్గొన్నారు.



## వాహనాల తనిఖీ

**ప్రజాపక్షం/చివ్వెంల :** మాదక ద్రవ్యాలు ఉపయోగించిన, తరలించినా చట్టపరంగా చర్యలు తప్పవని ఎస్ఐ మహేశ్వర్ హెచ్చరించారు. డ్రగ్స్ వినియోగం, అక్రమ తరలింపు నివారణలో భాగంగా మండలంలోని గుంపుల శివారు యందు సారంగి హోటల్ సమీపంలో జాతీయ రహదారి ఎన్‌హెచ్65పై వాహనలను పోలీస్ జాగిలంతో క్షుణ్ణంగా వాహనాలను తనిఖీ చేశారు. చట్ట వ్యతిరేకంగా ఎవరూ కూడా నిషేధిత డ్రగ్స్ ఉపయోగించవద్దన్నారు.

## గ్రామసమగ్రాభివృద్ధికి తోడ్పడాలి

**ప్రజాపక్షం/అర్వపల్లి :** రాజకీయాలకు అతీతంగా గ్రామ సమగ్రాభివృద్ధికి తోడ్పడాలని మండల తహశీల్దార్ శ్రీకాంత్ అన్నారు. బుధవారం గ్రామ సర్పంచ్ కర్నాటి వెంకన్న ఆధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఆయన హాజరై మాట్లాడారు. రానున్న వర్షకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే రైతులు వరికి బదులు వాణిజ్య పంటలు సాగు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ లింగంపల్లి రవీందర్, పంచాయితీ కార్యదర్శి సుధాకర్, ఆయా శాఖల అధికారులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** గ్రామంలో మౌళిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని పెన్‌పహాడ్, పొట్లపహాడ్, సింగారెడ్డిపాలెం గ్రామాల సర్పంచులు ఒగ్గు రవి, చిన్న లింగయ్య, వగ్గు కిరణ్‌లు అన్నారు. బుధవారం మండలంలోని పెన్‌పహాడ్, పొట్లపహాడ్, సింగారెడ్డిపాలెం గ్రామాలలో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక గ్రామ సభలలో వారు మాట్లాడారు. వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగుండా చూసేందుకు ప్రధానంగా ఏడు అంశాలపై ప్రణాళికలు సిద్ధం చేసి, గ్రామసభలో చర్చించినట్లు తెలిపారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని కోరారు. ప్రైవేటు, కార్పోరేట్ విద్యాసంస్థలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనందిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ జానయ్య, ఎంపిఓ బి. రాజేశ్వర్, డాక్టర్ కిరణ్ కుమార్, ఏఎస్ఐ రాములు, సహాయ ఇంజనీర్, ఆర్ఐ రంజిత్ రెడ్డి, ఆయా గ్రామాల పంచాయితీ కార్యదర్శులు, ఉపసర్పంచులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.







## ప్రమాదాలు అరికట్టాలి... ప్రాణాలు నిలబెట్టాలి



**ప్రజాపక్షం/హాలియా:** నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతుండటం మూలాన జరుగుతున్న ప్రమాదాలతో ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని దీనివలన ఎన్నో కుటుంబాలు వీధిన పడుతున్నాయని హాలియా ఎస్ఐ బండి సాయి ప్రశాంత్ అన్నారు.బుధవారం హాలియాలోని 9వ వార్డులో అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి జీవించి ఉంటే ఏదైనా చేయవచ్చని అదే ప్రాణం పోతే తిరిగి తీసుకురాలేమనే సత్యాన్ని గ్రహించి ప్రమాదాలు జరగకుండా స్వయం నియంత్రణతో వాహనాలు నడపాలని చెప్పారు. నిర్లక్ష్యంగా వాహనాలను నడుపుతూ ప్రమాదాలకు కారణం అవుతున్న వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనాలు నడిపేటప్పుడు సీట్ బెల్ట్ ధరించడం ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని తెలిపారు. రోడ్డు భద్రత వారోత్సవాలలో వీటిపై ప్రజలకు పలు మార్లు అవగాహన కల్పించామని చెప్పారు. ఈకార్యక్రమంలో వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్,9వ వార్డు కౌన్సిలర్ చెరుపల్లి ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

## సోదర స్మృతికి అక్షర స్తూపం..తమ్ముడొక స్లామ్‌బుక్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/నకిరేకల్ :** మాజీ సైనికుడు బెల్లి జనార్దన్ స్మృతికి అక్షర నివాళిగా ప్రొఫసర్ బెల్లి యాదయ్య రచించిన తమ్ముడొక స్లామ్‌బుక్ దీర్ఘకవితను బుధవారం నకిరేకల్‌లో ఆవిష్కరించారు.బెల్లి జనార్దన్ 53వ జయంతి సందర్భంగా శకుంతల ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మహాకవి గింజల నర్సింహారెడ్డి గ్రంథాన్ని ఆవిష్కరించి,ఇది సాహిత్య చరిత్రలో నిలిచిపోయే కావ్యమని అన్నారు.జనార్దన్ సేవలను కవి యాదయ్య అద్భుతంగా కవిత్వీకరించారని పేర్కొన్నారు.గ్రంథ సమీక్షకుడు,కేంద్ర సాహిత్య యువపురస్కార గ్రహీత తగుళ్ల గోపాల్ మాట్లాడుతూ సోదర స్మృతిని స్ఫూర్తి,స్నేహం,మనోవికాస కావ్యంగా మలిచారని ప్రశంసించారు.కార్యక్రమానికి సీహెచ్ యాదగిరి అధ్యక్షత వహించారు.ఈకార్యక్రమంలో ఎంవి గోనారెడ్డి,క్రాంతి,చింతల యాదగిరి,మునాసు వెంకట్, నాగయ్య,డాక్టర్ దూదిమెట్ల బాలరాజు యాదవ్, వేముల పుష్ప,తరాల పరమేశ్,తాడిశెట్టి శ్రీనివాస్, డాక్టర్ సాగర్ల సత్తయ్య,పెరుమాళ్ల ఆనంద్,పి.వెంకటరమణ,బండారు శంకర్,నోముల గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమంలో మీడియాదే కీలక పాత్ర



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** తెలంగాణ రాష్ట్ర అస్తిత్వం కోసం జరిగిన దీర్ఘకాలిక ప్రజా పోరాటంలో మీడియా అత్యంత ప్రభావవంతమైన పాత్ర పోషించిందని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రొఫసర్ శ్రీనివాస్ వడ్డానం పేర్కొన్నారు.బుధవారం మహాత్మా గాంధీ యూనివర్సిటీలో నల్లగొండ చరిత్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ ఉద్యమంలో మీడియా పాత్ర అనే అంశంపై ఆయన మాట్లాడారు.తెలంగాణ ప్రశ్నను కేవలం రాజకీయ వేదికలకే పరిమితం కాకుండా,గ్రామ గ్రామాలకు తీసుకువెళ్లి సామాన్య ప్రజల గుండెల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలించిన శక్తిగా మీడియా నిలిచిందన్నారు.ప్రత్యేకించి హైదరాబాద్, వరంగల్, నల్లగొండ సహా రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయ కేంద్రాల్లో విద్యార్థుల నేతృత్వంలో జరిగిన భారీ ఆందోళనలకు ఎలక్ట్రానిక్,ప్రింట్, న్యూ మీడియా సంపూర్ణ సహకారం అందించిందన్నారు.విద్యార్థుల ఆకాంక్షలను సమాజం ముందుకు తీసుకువెళ్లే బాధ్యతను మీడియా ముందుండి పోషించిందని చెప్పారు. తమ పోరాటాన్ని గుర్తిస్తున్నారని చూసినప్పుడు విద్యార్థుల మనోధైర్యానికి మీడియా మరింత ధైర్యాన్ని నింపిందని వ్యాఖ్యానించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ ప్రియ, చరిత్ర విభాగం బీఓఎస్ ఆచార్య విజయ బాబు,ఆచార్య శ్రీనివాస్,కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ పనస రామకృష్ణ,అధ్యాపకులు డాక్టర్ శరీఫ్, డా. శ్రీనివాస్, వివేక్, విద్యార్థులు పాల్గొన్నారు.

## గిరి జంగమ్మ చిత్రపటానికి నివాళులర్పించిన ఎమ్మెల్సీ



**ప్రజాపక్షం/నాంపల్లి :** సిపిఐ మండల నాయకులు గిరి స్వామి మాతృమూర్తి గిరిజంగమ్మ దశదినకర్మ కార్యక్రమం చిట్టంపహాడ్ గ్రామంలో బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం గిరి జంగమ్మ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సానుభూతిని తెలియజేశారు.ఈకార్యక్రమంలో కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్,సిపిఐ రాష్ట్ర నాయకులు పల్లె నర్సింహారెడ్డి,సినియర్ నాయకులు మల్లెపల్లి ఆదిరెడ్డి,మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కత్తి రవీందర్ రెడ్డి,మాజీ ఎంపీపీ పూల వెంకటయ్య,నాంపల్లి సర్పంచ్ నక్క చంద్రశేఖర్,ఉపసర్పంచ్ అమరావతి యాదయ్య,టీపీ గౌరారం సర్పంచ్ ప్రసన్న కృష్ణారెడ్డి,స్థానిక సర్పంచ్ కోరే దేవేందర్ సైదులు,ఈద శేఖర్,గడ్డ వెంకటేశ్వర్లు,బక్క అమరేందర్,మాజీ సర్పంచ్ చందు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు అన్నదానం



**ప్రజాపక్షం/చింతపల్లి :** సిరి మహాలక్ష్మి ఇన్ఫ్రాడెవలపర్స్ వ్యవస్థాపకులు, చైర్మన్, ప్రముఖ వ్యాపారవేత్త కల్లం వెంకటేశ్వరరెడ్డి జన్మదినం సందర్భంగా మండల కేంద్రంలోని వృద్ధాశ్రమంలో సిరి మహాలక్ష్మి ఇన్ఫ్రాడెవలపర్స్ ఆధ్వర్యంలో బుధవారం అన్నదానం పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని పలు గ్రామాలలో కె.వి.ఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకొని, మిఠాయిలను పంచిపెట్టారు. కె.వి.ఆర్ మాట్లాడుతూ సిరి మహాలక్ష్మి ఇన్ఫ్రాడెవలపర్స్ ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపడతానన్నారు. ఆయా గ్రామాల అభివృద్ధికి తనవంతుగా సహాయ సహకారాలు అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. తన జన్మదిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన అందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## నిందితులను అరెస్టు చేయాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి నిప్పుపెట్టిన నిందితులను తక్షణమే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని టిడిపి నల్లగొండ పార్లమెంటు అధ్యక్షుడు కసిరెడ్డి శేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు.ఈనెల 6వ తేదీన రాత్రి కొంతమంది దుండగులు పట్టణంలోని హైదరాబాద్ రోడ్‌లో గల ఎన్‌టిఆర్ విగ్రహానికి పెట్రోల్ పోసి నిప్పు అందించిన వారిని గుర్తించి తక్షణమే అరెస్టు చేయాలని కోరుతూ బుధవారం టిడిపి ఆధ్వర్యంలో జిల్లా ఎస్‌పి కి వినతిపత్రం సమర్పించారు.ఈసందర్భంగా కసిరెడ్డి మాట్లాడుతూ ఎన్‌టిఆర్ విగ్రహానికి నిప్పు పెట్టడం చాలా విచారకరమన్నారు. ఇప్పటికైనా పోలీసులు వెంటనే విచారణ చేపట్టి ఇలాంటి సంఘ విద్రోహ శక్తులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని కోరారు. ఎస్పీకి వినతి పత్రం సమర్పించిన వారిలో నాయకులు గుండు వెంకటేశ్వర్లు,రవి పాల్గొన్నారు.

## ఘనంగా డిసిసి అధ్యక్షుడు పున్న కైలాష్ నేత జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పున్న కైలాష్ నేత జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన అభిమానులు,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ చేశారు.అదేవిధంగా హృదయ భవన్‌లో బాలలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా కార్యకర్తలు,అభిమానులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం లాఠీలు, తూటాలకు ఎదురొడ్డి పోరాడిన నేత అని,తెలంగాణ విద్యార్థి నాయకుడిగా ఆయన ఉద్యమాలు, పోరాటాలు చేసిన ఘనత ఆయనకు దక్కిందన్నారు. అలాంటి నాయకుడు భవిష్యత్తులో మరిన్ని పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. 2029 సాధారణ ఎన్నికల్లో ఎమ్మెల్యే పదవి చేపట్టాలని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో బోడ స్వామి,జిల్లెపల్లి పరమేష్,ఎరుపుల శ్రవణ్,ఏళ్ల రవీందర్ రెడ్డి,ముంతాజ్ అలీ,పగిళ్ల రాజు,ఇద భాస్కర్,తాడూరి శ్రీనివాస్,శరత్, జశ్వంత్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.





## ప్రభుత్వ వైద్యశాలలో మొక్కలు నాటిన అధికారులు, ప్రజాప్రతినిధులు

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మొక్కలు నాటడం వల్ల పచ్చదనం పెంపోందించి తద్వారా స్వచ్ఛమైన వాతావరణం ఏర్పడుతుందని గరిడేపల్లి ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో సమాజంలో డ్రగ్స్ నిర్మూలనలో భాగంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ యువతను, ప్రజలను పట్టిపీడిస్తోన్న మాదకద్రవ్యాలను పూర్తిగా నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేకపోతుల వెంకటమ్మ, మాజీ జడ్పిటిసి పెండెం శ్రీనివాసగౌడ్, వైద్యాధికారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## అప్రమత్తంగా ఉండండి




**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** వాహనదారులు అప్రమత్తంగా డ్రైవింగ్ చేసి సురక్షితంగా ఇంటికి చేరాలని హుజూర్‌నగర్ సిఐ చరమందరాజు అన్నారు. బుధవారం నేరేడుచర్ల మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా రోడ్డు భద్రత వారోత్సవాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. మద్యంతాగి వాహనాలు నడపడం వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని అన్నారు. పట్టణంలోని ముఖ్య కూడళ్లలో ప్రత్యేక బృందాలతో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించబడతాయని అన్నారు. అనంతరం మున్సిపల్ సిబ్బందికి హెల్మెంట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొణతం చిన్న వెంకటరెడ్డి, కమిషనర్ నాగరాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ సందీప్‌రెడ్డి, ఎస్ఐ సైదిరెడ్డి పాల్గొన్నారు.

## నేలమర్రి క్లస్టర్ ఎఈవోగా సునీత బాధ్యతల స్వీకరణ

**ప్రజాపక్షం/మునగాల:** మండల పరిధిలోని నేలమర్రి క్లస్టర్‌కు గతంలో పనిచేసిన ఎఈవో సిహెచ్ భవాని జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం క్లస్టర్‌కు బదిలీపై వెళ్లగా ఆమె స్థానంలో నేలమర్రి క్లస్టర్‌కు యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం వెంకిర్యాల క్లస్టర్ నుండి గుగులోతు సునీత బదిలీపై ఇక్కడకు వచ్చారు. తాడ్వాయి, మాధవరం, నెలమర్రి రెవిన్యూ గ్రామాల రైతులు 78159 61390 నెంబర్ ద్వారా ఎఈవోను సంప్రదించాలని మండల వ్యవసాయ అధికారి బుంగ రాజు తెలిపారు.

## నాలాలు కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/నకిరేకల్:** ప్రజా పాలన,ప్రగతి ప్రణాళికలో భాగంగా నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని 17నండి 20 వార్డులకు సంబంధించి ముత్యాలమ్మ గుడి దగ్గర వార్డు సభలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ పాల్గొని మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభం అవుతోంది కాబట్టి నాలాలు కబ్జాకు గురికాకుండా చర్యలు చేపట్టాలని, నాలాల లో పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి నకిరేకల్‌ను వరద బారిన పడకుండా ముందే చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

## 14న హక్కుల నేత సుబ్బారావు సంస్మరణ సభ



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రముఖ విద్యావేత్త, పౌర హక్కుల ఉద్యమకారుడు, ప్రజాస్వామిక విలువల పరిరక్షకుడు సుబ్బారావు సంస్మరణ సభ జూన్ 14న ఉదయం 10 గంటలకు మిర్యాలగూడలోని కళాభారతిలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు, ప్రజా సంఘాలు తెలిపారు. బుధవారం పలువురు వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలకుపైగా మిర్యాలగూడలో మూడు తరాలకు చెందిన వందలాది మంది విద్యార్థులకు ఆంగ్ల భాషను బోధించిన సుబ్బారావు మూడు దశాబ్దాల పాటు పౌర హక్కులు, మానవ హక్కుల ఉద్యమాలలో కీలక పాత్ర పోషించారని అన్నారు. జీవితాంతం ప్రజాస్వామిక విలువలు, మానవ హక్కుల పరిరక్షణ కోసం కృషి చేసిన ఆయన జూన్ 4న తన 92వ ఏట కన్నుమూశారన్నారు. ఆయన సేవలను స్మరించుకుంటూ నిర్వహిస్తున్న ఈ సంస్మరణ సభలో ప్రముఖ మేధావులు, ప్రజా సంఘాల నాయకులు, రాజకీయ నాయకులు పాల్గొని నివాళులర్పించనున్నారని తెలిపారు. ప్రొఫెసర్ హరగోపాల్ మానవ హక్కులు విలువలు సమాజం అనే అంశంపై ప్రధాన ప్రసంగం చేయనున్నారని. ప్రొఫెసర్ కోదండరాం, గోరేటి వెంకన్న, విమలక్క, జీవన్ కుమార్ తదితరులు ప్రసంగించనున్నారని అన్నారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి , ఎమ్మెల్సీ శంకర్ నాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ చిలుకూరు సుధాబాలు, మాజీ ఎమ్మెల్యేలు జూలకంటి రంగారెడ్డి, తిప్పన విజయసింహారెడ్డి, నల్లమోతు భాస్కరరావు హాజరుకానున్నారని అన్నారు.

## పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలి




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం సామాన్య ప్రజలపై అదనపు భారం మోపుతూ విడతల వారీగా పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారీ ఐలయ్య డిమాండ్ చేశారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని సుందరయ్య భవన్ లో కందుకూరి రమేష్ బాబు అధ్యక్షతన నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం మండల ఎనిమిదవ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగియగానే కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చేలా దేశంలో డీజిల్ ధరను రూ.103.83 పైసలకు, పెట్రోల్ ధరను రూ.115.73 పైసలకు పెంచి ప్రజలకు మోడీ ప్రభుత్వం షాకులు ఇస్తోందని మండిపడ్డారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీల ప్రకారం వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రూ.12 వేలు, మహిళలకు నెలకు రూ.2,500, వ్యవసాయ కార్మికులకు రూ.5 వేల పెన్షన్ ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ మహాసభలో సీఐటీయూ రాష్ట్ర నాయకులు డబ్బికార్ మల్లేశం, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.రవినాయక్, కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు రేమిడాల పరుశురాములు, రైతు సంఘం జిల్లా నాయకులు రాగిరెడ్డి మంగారెడ్డి పాల్గొన్నారు. ఈ మహాసభలో 19 మందితో కూడిన మండల నూతన కమిటీని ఏర్పాటు చేయగా, అధ్యక్షుడిగా కందుకూరి రమేష్, కార్యదర్శిగా పిల్లుట్ల సైదులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## విడ్డూరం.. సాక్షాత్తు డైరెక్టర్ ఆఫ్ తెలంగాణ పోలీస్ అకాడమీ సభలో కునుకు తీస్తున్న ఎంపిఓ



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** అత్యంత ప్రతిష్టాత్మకంగా బుధవారం నిర్వహించిన రోడ్ సేఫ్టీ గ్రామ సభ దేశ్ముఖి కార్యక్రమంలో పోచంపల్లి ఎంపీఓ సాక్షాత్తు డైరెక్టర్ ఆఫ్ తెలంగాణ పోలీస్ అకాడమీ అభిలాష్ బిష్ట్ సభలో సభ జరుగుతున్నంత సేపు బాధ్యత మరిచి కునుకు తీస్తూ దర్శనమిచ్చారు. ఒక వైపు మహామహులు రోడ్ సేఫ్టీ భద్రత అంశాలపై ఎమ్మెల్యేతో సహా ఉపన్యాసాలు ఇస్తూ అవగాహన కల్పిస్తుంటే బాధ్యత రాహిత్యంగా కనీసం హోదాను మరిచి నిద్రపోతూ సభలో కూర్చుండటం అందరినీ విస్మయానికి గురిచేసింది. పైగా ఉన్నతాధికారులు ప్రోటోకాల్ ప్రకారం ముందు వరుసలో కూర్చున్న ఆమె గ్రామ ప్రజలంతా చూస్తుండగానే మాటిమాటికి నిద్రపోతూ తూలి పడుతూ అటు ఇటూ ఊగుతూ ఎవరు ఏం చెబుతున్నారో వినకుండా ఉండటం ఉద్యోగరీత్యా సరియైన దేనా అని అందరు ముక్కున వేలేసుకుంటున్నారు. చూడాలి మరి అధికారులు ఏం చేస్తారో ఎలాంటి చర్య తీసుకుంటారో? ఏముందిలే ఎవరు ఏం చేస్తారూ ! అని ధీమా వ్యక్తం చేస్తారా? లేదా? కనీసం మెమో అయినా జారీ చేస్తారా! ఇతర అధికారులకు కనువిప్పు చేస్తారా? అనేది వేచి చూడాల్సి ఉంది.

## మాదకద్రవ్యాలను అంతం చేయడమే లక్ష్యం



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** సమాజాన్ని పట్టి పీడిస్తున్న మాదకద్రవ్యాల మహమ్మారిని అంతం చేయడమే లక్ష్యమని ఎస్ఐ సైదిరెడ్డి అన్నారు. తెలంగాణ పోలీస్ లీగల్ టీం నేతృత్వంలో సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా వినూత్న కార్యక్రమం చేపట్టారు. ఈ నేపథ్యంలో బుధవారం నేరేడుచర్ల పోలీసుల ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలలో ప్రభుత్వం వైద్యులు, రెవిన్యూ, పంచాయతీరాజ్ పలు శాఖల అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎస్ఐ సైదిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో యువతను, ప్రజలను పట్టిపీడిస్తోన్న మాదకద్రవ్యాలను పూర్తిగా నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిని నాగిని, పోలీస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## ధర్నాకు సిపిఐ నాయకులు

**ప్రజాపక్షం/చింతలపాలెం :** నిత్యవసర సరుకులు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలని సిపిఐ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట బుధవారం జరుగు ధర్నా కార్యక్రమానికి మండలం కేంద్రం నుంచి సిపిఐ నాయకులు బయలుదేరారు. ఈ సందర్భంగా సిపిఐ మండ ల కార్యదర్శి చింతిరాల రవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ అనాలోచిత చర్యల వల్ల సామాన్య ప్రజలపై భారం పడుతుందన్నారు. వెంటనే కేంద్రం స్పందించి ధరలను తగ్గించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా సిపిఐ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. అందులో భాగంగా సూర్యాపేట కలెక్టరేట్ కార్యాలయానికి తరలి వెళ్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ కార్యదర్శి గందం మంగయ్య, అబ్దుల్ భాష, పద్మ, రామారావు, సైదులు, అచ్చమ్మ, సత్యం, శ్రీను పాల్గొన్నారు.

## 'హలో కామ్రేడ్ -చలో కలెక్టరేట్'



**ప్రజాపక్షం/రామన్నపేట :** నిత్యావసర వస్తువులతోపాటు గ్యాస్,పెట్రోల్, డీజిల్ ధరలు రోజురోజుకు పెరుగుతూ సామాన్యప్రజలకు అందుబాటులో లేకుండా ఆకాశాన్ని తాకుతున్నందులకు నిరసనగా బుధవారం రోజున భారత కమ్యూనిస్టు పార్టీ తలపెట్టిన ఆందోళన కార్యక్రమానికి రామన్నపేట మండల సిపిఐ నాయకులు తరలి వెళ్లడం జరిగింది. ఈ కార్యక్రమంలో రామన్నపేట సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరు నరసింహ, జిల్లా నాయకులు ఎర్ర రమేష్, ఊట్కూరి భగవంత, గంగాపురం యాదయ్య, రచ్చ యాదగిరి, వీరమల్ల ముత్తయ్య, గంగాపురం వెంకటయ్య, వీసం గాలయ్య, ఊట్కూరు కృష్ణ, మల్లేష్ పాల్గొన్నారు.

## రైతులు సబ్సిడీ పథకాలను సద్వినియోగం



**ప్రజాపక్షం/నడిగూడెం:** ప్రభుత్వ సబ్సిడీపై అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మల్సూర్, నడిగూడెం సర్పంచ్ దున్నశ్రీనివాస్ అన్నారు. బుధవారం నడిగూడెం మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ అధికారులు సబ్సీడిపై అందిస్తున్న జీలుగు విత్తనాలను వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం సబ్సీడీపై విత్తనాలు అందిస్తుందని తెలిపారు. ప్రభుత్వం 50శాతం సబ్సీడి పోనూ 30 కేజీల జీలుగు విత్తనాలు బ్యాగ్ ధర 2450 రూపాయలు అని, జీలుగు విత్తనాలు కావాల్సిన రైతులు భూమి జీరాక్స్ పత్రంతో పాటు ఆధార్‌కార్డు జీరాక్స్‌లను తీసుకుని వ్యవసాయశాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిఈవో కిరణ్, ఎఈవో వెంకటరెడ్డి, ఉపేందర్, రైతులు ఎలక సంజీవరెడ్డి, రాజశేఖర్, చిమట వీరబాబు, నక్క రమేష్ పాల్గొన్నారు.

## అన్నదానం



**ప్రజాపక్షం/అనంతగిరి:** తెలంగాణ శబరిమల అనంతగిరి శ్రీ అయ్యప్ప స్వామి సన్నిధిలో సంక్రాంతి పండుగనుండి ప్రతి బుధవారం ప్రారంభమైన అన్నప్రసాద వితరణలో భాగంగా బుధవారం దేవాలయంలో అమెరికాకు చెందిన సాయికృష్ణ హిమాని దాతలుగా వ్యవహరించారు. దేవాలయంలో ట్రస్టు చైర్మన్ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ కొండపల్లి వాసు, అఖిల భారత అయ్యప్పస్వామి దీక్షా ప్రచార సమితి జిల్లా కార్యదర్శి జగిని ప్రసాద్, బాణోతు శివాజీనాయక్, రవీందర్ నాయక్, ఉపేందర్‌నాయక్, నర్సింహరావు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక లక్ష్యం

## కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట (ఆత్మకూర్(ఎస్)** : ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లక్ష్యమని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. బుధవారం ఆత్మకూర్(ఎస్) మండలంలోని నెమ్మికల్ గ్రామ పంచాయితీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభకు ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామాల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం మార్చి 6వ తేది నుండి అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా అమలు చేయబడుతుందన్నారు. గ్రామసభలు ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలను చేరవేసే సమర్థవంతమైన వేదికలన్నారు. విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, పారిశుద్ధ్యం, వర్షాకాలంలో అంటువ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువవుతున్నాయని అన్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు పంట మార్పిడి విధానాలను అనుసరించాలని, వ్యవసాయ శాఖ సూచనల మేరకు శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని సూచించారు. ఎరువులు, పురుగుమందుల వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, పంటల దిగుబడులు పెరిగేలా ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని రైతులకు సూచించారు. గ్రామాల్లో సాలిడ్ అండ్ లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని, తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే అలవాటు ప్రతి కుటుంబం అలవరుచుకోవాలని కోరారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఎస్ఐఆర్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక మౌలిక వసతులు, డిజిటల్ విద్య, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు తదితర సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపిఓ యాదగిరి, తహశీల్దార్ అమిన్‌సింగ్, ఎంపిడిఓ హసింహలీ, మెడికల్ ఆఫీసర్ రమ్యరెడ్డి, ఏఓ దివ్య, ఎంఈఓ దారాసింగ్, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కాంట్రాక్టర్లు డిష్యుం... డిష్యుం...!

### పనుల పంపకాలు కుదరక...
### మున్సిపల్ చైర్‌పర్సన్ సాక్షిగా...
### ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు




సూర్యాపేట మున్సిపల్ కాంట్రాక్టర్లు పనుల పంపకాల్లో వివాదం తలెత్తి తన్నుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మున్సిపల్ చైర్‌పర్సన్ సాక్షిగా తన్నుకొని ఏకంగా పోలీసులకు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు.

**ప్రజాపక్షం/సూర్యాపేట** :సూర్యాపేట మున్సిపల్ నూతన పాలక వర్గం కొలువుదీరిన తర్వాత మార్చి నెల చివరలో నిర్వహించిన మొదటి బడ్జెట్ సమావేశంలో వార్డుల అభివృద్ధి పనుల కోసం మున్సిపల్ జనరల్ ఫండ్ నుండి ఒక్కొక్క వార్డుకు రూ.5లక్షలు కేటాయిస్తూ సభ్యులు తీర్మానం చేయడం జరిగింది. ఈ అభివృద్ధి పనులను చేసేందుకు మున్సిపాలిటి పరిధిలో ఉన్న 66 మంది కాంట్రాక్టర్లు పోటీపడ్డారు. మున్సిపాలిటిలో జరిగే అభివృద్ధి పనులు 10 నుండి 15 మంది కాంట్రాక్టర్లు చేస్తూ వస్తుండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చేసేందుకు పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మొదటి సారిగా పనుల కోసం మున్సిపల్ పాలక వర్గం నిధులు కేటాయించడంతో చిన్నచితక కాంట్రాక్టర్లు అందరూ పనులు మేము చేస్తామంటే మేము చేస్తామంటూ పోటీపడ్డారు. దీంతో కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జలీల్ అధ్యక్షతన సమావేశమై పోటీలేకుండా పనులను పంచుకోవాలని తీర్మానం చేసుకున్నట్లు సమాచారం. 16 మంది కాంట్రాక్టర్లు ఒక్కొక్క వార్డుకు సంబంధించిన అభివృద్ధి పని చేసేలా... మరికొంత మంది కాంట్రాక్టర్లు వార్డుకు ఇద్దరి చొప్పున పనిచేసేలా ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది. ఇదే విషయం మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాదికి చెప్పేందుకు విద్యానగర్‌లో ఉన్న వారి నివాసానికి సదరు కాంట్రాక్టర్లు అందరూ గత మూడు రోజుల క్రితం వెళ్ళారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ మాజీ కౌన్సిలర్ తండు శ్రీనివాస్ గౌడ్ తన కుమారుడు సవీందర్ కాంట్రాక్టర్ కావడంతో తాను నివాసం ఉంటున్న 22వ వార్డు పనులను తన కుమారుడికే ఇవ్వాలని చైర్‌పర్సన్ వద్ద పట్టుబట్టారు. తనని కాదని బిఆర్ఎస్‌కి చెందిన కాంట్రాక్టర్ మోత్కూరి సందీప్‌కు పని దక్కడంతో ఆవేశానికి లోనైన ఆయన నేను కాంగ్రెస్ నాయకుడిని, మాజీ కౌన్సిలర్‌ను నా కుమారుడికి కాకుండా సందీప్‌కు ఇవ్వడమేమంటూ తీవ్ర అభ్యంతరం తెలిపినట్లు మిగతా కాంట్రాక్టర్లు బహిరంగంగానే చెబుతున్నారు. ఈ క్రమంలో సందీప్‌ను ప్రచురించలేని దుర్భాషలు ఆడడంతో వీరి మధ్యన తన్నులాటకు దారితీసింది. మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది సాక్షిగా కాంట్రాక్టర్లు కొట్టుకోవడం పట్టణంలో పెద్దఎత్తున చర్చనీయాంశంగా మారింది. ఒకరిని ఒకరు తన్నుకున్న వారు పోలీసులను ఆశ్రయించి ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారు. దీనితో ఆగకుండా మాజీ కౌన్సిలర్ తండు శ్రీనివాస్ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు, కాంట్రాక్టర్ మోత్కూరి సందీప్ ఇద్దరిది ఒకే వార్డు కావడంతో ఒకరిపై ఒకరు ఆగకుండా దూషణలు చేసుకుంటున్న పరిస్థితి. పోలీసులు కూడా వారు ఇచ్చిన ఫిర్యాదులపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# చదువు జీవితాలను మారుస్తుంది

## మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/తిప్పర్తి:** చదువు జీవితాలను మారుస్తుందని,విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. తిప్పర్తి మండల కేంద్రంలో నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను బుధవారం ఆయన పరిశీలించారు.జూలై 1న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని,ఇళ్లలో అన్ని వసతులు కల్పించాలని,చిన్న చిన్న మరమ్మతులు ఉంటే పూర్తి చేసి గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రూ.6 కోట్లతో తిప్పర్తి మండల కేంద్రంలో మంజూరైన జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులను తనిఖీ చేశారు.మీడియాతో మాట్లాడుతూ గత సంవత్సరం జిల్లాలోని తిప్పర్తి,కనగల్ మండలాల్లో ఒక్కొక్కటి రూ.6 కోట్లతో అధునాతన సౌకర్యాలతో జూనియర్ కళాశాల భవనాలను మంజూరు చేశామని,పూర్తి నాణ్యతతో నిర్మించి నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.భవన నిర్మాణాన్ని 6 నెలల్లో పూర్తి చేయాలని అధికారులను,కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. తిప్పర్తి మండల కేందర్ంలో నిర్మించిన 100 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను జూలై 1 నాటికి అన్ని వసతులతో పూర్తిచేసి గృహప్రవేశాలకు సిద్ధంకార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్,ఆర్అండ్‌బి ఎస్ఈ శ్రీధర్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్,తిప్పర్తి సర్పంచ్ బద్దం రజిత సుధీర్,తహసీల్దార్ రామ కృష్ణ,ఎంపీడీవో జానయ్య,పాశం సంపత్ రెడ్డి,ఏపీవో రామ్మోహన్ పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకం




# మండుటెండలో కూలీల అవస్థలు...

### ఉపాధి కూలీల ప్రాణాలకు లేని హామీ...
### కనీస వసతులు లేని పని ప్రదేశాలు
### అధికారులనిర్లక్ష్యానికి నిలుపుటద్దం

**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** మండలంలో పగటిపూట ఉష్ణోగ్రతలు విపరీతంగా ఉన్న నేపథ్యంలో ఉపాధి హామీ పనులను హాజరవుతున్న కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కానీ పని ప్రదేశాలలో మంచినీరు, టెంట్, ప్రాథమిక సౌకర్యాలు లేక ఎండలోనే కూలీలు అల్లాడిపోతున్నామని కూలీలు అంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పని ప్రదేశాలలో కూలీలకు కనీస వసతులు కల్పించాల్సి ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదని వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పుడు కొత్తగా ఎండ తీవ్రతతో సంబంధం లేకుండా రోజుకు రెండు పూటలా పని ప్రదేశాలలో హాజరు వేయడానికి ఫోటోలు తీయడం (ఎన్ఎంఎంఎస్) యాప్ కూలీలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. మండుటెండలో కూడా ముఖ గుర్తింపు తప్పని సరి చేసింది. అయితే ఈ విధానం వల్ల క్షేత్ర స్థాయిలో కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు సమయానికి రాకపోవడంతో ఫోటోలు తీయడం లేట్ అవుతుందని ఎండలో ఎక్కువ సేపు ఉండటం వల్ల మంచినీరు అందుబాటులో లేక, వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని కూలీలు అంటున్నారు. పని సమయం పూర్తి అయిన తర్వాత మరల రెండవ సారి ఫోటులు అంటూ ప్రవేశపెట్టిన ఈ విధానంలో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు సమయానికి వచ్చి ఫోటోలు తీయకపోవడంతో గంటల తరబడి వేచిచూడాల్సి వస్తుందని అంటున్నారు.

**ఇంటి నుంచే మంచినీళ్ల బాటిళ్లు...** పని ప్రదేశాలలో తాగునీటి సదుపాయం లేకపోవడంతో కూలీలు ఇంటి వద్ద నుంచే మంచినీటిని తీసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అంటున్నారు. దాహంతో కొందరు తల్లడిల్లుతున్న పట్టించుకనే నాధుడే లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మాత్రం ఈ విషయంలో ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని, కనీసం మంచినీటిని ఏర్పాటు చేయలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కరువైన ప్రథమ చికిత్స** : పని సమయంలో కూలీలకు ఎవరికైన గాయాలు జరిగితే వెంటనే చికిత్స అందించడం కోసం ప్రథమ చికిత్స కిట్లు కూడా అందుబాటులో ఉండాల్సి ఉండగా ఇవి ఏమీ అందుబాటులో ఉండటం లేదని అంటున్నారు. ఇలాంటి ప్రథమ చికిత్స జాగ్రత్తలు తీసుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం అని విమర్శలు వినిపిస్తున్నాయి.

**ఆర్థిక ఇబ్బందులు....** చేసిన పనికి సకాలంలో డబ్బులు పడకపోవడం కొన్ని సందర్భాలలో నెలల తరబడి కూలీల వేతనాలు నిలిచిపోవడం వల్ల కూలీలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పలువురు కూలీలు ఆరోపిస్తున్నారు. కొన్ని సార్లు పని చేసిన మాస్టర్ రోల్ తప్పువగా ఉందని, మీకు డబ్బులు పడాలంటే మరో వారం కూడా మమ్ములను ఫోటోలు తీపిస్తున్నారని దీంతో మేము ఏ పనికి వెళ్లలేకపోతున్నామని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**సాంకేతిక సమస్యలు... వయసు ప్రభావం**

ఎక్కువ వయసు ఉన్న కూలీలు, కంటిచూపు లేదా ముఖంలో మార్పుల వల్ల యాప్‌లో వారిని సులభంగా గుర్తించలేకపోతుంది. దీనివల్ల వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇదేమీటని అడిగితే మీ కండ్లు పడటం లేదని, మీరు ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాలని అధికారులు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో కొంతమంది కూలీలు ఉపాధి హామీ పనులకు వెళ్లి ఫోటోలతో పాటు కండ్లు పడకపోవడంతో పనులు చేయకుండా వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది.